క్లుప్తంగా

వీఎంసీలో నేడు 'స్పందన'

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించుకునేందుకు నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూం, నగరంలోని మూడు సర్కిల్ కార్యాలయాల్లో జోనల్ కమిషనర్ల ఆధ్వర్యంలో ప్రతి సోమవారం స్పందన కార్యక్రమం జరుగుతుందన్నారు. సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నగర వాసులు ఫిర్యాదులు, అర్జీలను అధికారులకు అందజేయాలన్నారు.

భక్తులకు అన్నప్రసాద వితరణ



భవానీపురం(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న కనకదుర్గమ్మ అమ్మవారికి ఆషాఢ మాసం సారె సమర్పించేందుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు వన్‌టౌన్ రథం సెంటర్‌లోని అప్పన వెంకట కృష్ణయ్య సత్రంలో ఆదివారం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ సుప్రీం ఆధ్వర్యంలో ఈ ఏడాది రిలీవింగ్ హంగర్ కార్యక్రమానికి రికగ్నైజ్డ్ డీసీ అయిన అప్పన వెంకట సత్యసాయి బాబు సహకారంతో 300 మందికి అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పీస్ పోస్టర్ కాంటెస్ట్ డీసీ లయన్ దివ్యవాణి హాజరై భక్తులకు అన్నం వడ్డించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అమ్మవారి భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించే అదృష్టాన్ని కనకదుర్గమ్మ తల్లి కల్పించిందన్నారు.

26 నుంచి టైలరింగ్‌లో శిక్షణ తరగతులు

వించిపేట(విజయవాడపశ్చిమ): పేద మహిళలకు ఆర్థిక భరోసా కల్పించే లక్ష్యంతో ఈ నెల 26వ తేదీ నుంచి మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఐద్వా నగర కార్యదర్శి గాదె ఆదిలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) ఆధ్వర్యంలో మహిళా అభ్యున్నతికి అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. నగరంలోని 49వ డివిజన్ కొత్తపేట పోలీస్ స్టేషన్ ఎదురు వీధి మోటూరి హనుమంతరావు శ్రామిక భవనంలో మూడు నెలల పాటు ప్రతి రోజు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు శిక్షణ తరగతులు జరుగుతాయన్నారు. ఈనెల 25వ తేదీలోగా 87121 25525 నంబర్‌కు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): న్యూ కళాక్షేత్ర నృత్యశాలకు చెందిన చిన్నారులు ఆదివారం దుర్గమ్మ సన్నిధిలో ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులకు విశేషంగా ఆకట్టుకుంది. ధర్మపథం కార్యక్రమంలో భాగంగా ఆదివారం దుర్గమ్మ సన్నిధిలోని రాజగోపురం ఎదుట కళావేదికపై నృత్య ప్రదర్శన ఇచ్చారు. 32 మంది చిన్నారులు పలు కీర్తనలకు లయబద్ధంగా నృత్య ప్రదర్శన చేశారు. అనంతరం వారికి అమ్మవారి దర్శనం కల్పించి, తీర్థప్రసాదాలను అందజేశారు.


కాళీమాతను దర్శించుకున్న తెలంగాణ మంత్రి కొప్పుల ఈశ్వర్

కృష్ణలంక(విజయవాడతూర్పు): బస్టాండ్ సమీపంలోని శ్రీ కాళీమాత అమ్మవారి దేవస్థానంలో మహంకాళీ అమ్మవారిని తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్ తరగతుల అభివృద్ధి, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ కమిటీ కార్యదర్శి కె.జగదీష్‌కుమార్, సూపరింటెండెంట్ ఎ.మధుసూదనరావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. మంత్రిని పట్టువస్త్రాలతో సత్కరించారు.

దత్తసాయి శివకామేశ్వరి పీఠంలో ప్రత్యేక పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరి పీఠంలో శ్రీధర్మపరిషత్ మహాసంస్థానమ్ ఆధ్వర్యంలో ఆదివారం మాసశివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. ఆలయ అర్చకులు స్వామివారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, బిల్వార్చనలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు నీలకంఠేశ్వర స్వామివారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమ సుందర వరప్రసాద్ పర్యవేక్షించారు.





ఇంద్రకీలాద్రిపై ఆషాఢ రద్దీ

ఆషాఢ మాసం చివరి ఆదివారం కావడంతో ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ కొనసాగింది. తెల్లవారు జాము నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణంలో కోలాహలం నెలకొంది. రెండు రాష్ట్రాల నుంచి భక్త బృందాలు తరలివచ్చి అమ్మ వారికి భక్తిశ్రద్ధలతో సారెను సమర్పించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ చైర్మన్, అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ









వైభవంగా శాంతి కల్యాణోత్సవం



శాంతి కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గవర్నర్‌పేట చల్లపల్లి బంగ్లా సమీపంలో వేంచేసి ఉన్న శ్రీ కాశీ విశ్వేశ్వర అన్నపూర్ణ దేవస్థానంలో ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని ఆదివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు జరిగాయి. ఇందులో భాగంగా హోమాలు, మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం, బిల్వార్చన, లక్ష మల్లె పూలతో స్వామి వారికి పుష్పార్చన నిర్వహించారు. అనంతరం స్వామి వారి పల్లకి సేవ, శాంతి కల్యాణోత్సవం నిర్వహించారు. స్వామి వారి కల్యాణంలో సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు పాల్గొని అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సేవల అనంతరం అన్నప్రసాద వితరణ జరిగింది. దాతలు అన్నవరపు దుర్గాకుమారి, రత్న శ్రీనివాస్, రామ దయాల్ అన్నప్రసాద వితరణకు సహకరించారు. ఆలయ ఈవో నూతక్కి వెంకట సాంబశివ రావు పర్యవేక్షణంలో పూజా కార్యక్రమాలు జరిగాయి.

కట్నం వేధింపులపై కేసు నమోదు

విజయవాడ స్పోర్ట్స్: విజయవాడకు చెందిన ఓ కుటుంబంపై విశాఖపట్నం మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో అదనపు కట్నం వేధింపుల కేసు నమోదైంది. విజయవాడ కృష్ణసాయి హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ చలసాని వెంకటేశ్వరరావు, ఆయన కుమారుడు హర్షకు, విశాఖపట్నంనకు చెందిన మహిళతో 2002లో వివాహం జరిగింది. వీరిద్దరికి నిశ్చితార్థం జరిగిన మరుసటి రోజునే హర్ష కోరిక మేరకు కొత్త కారును మహిళ తండ్రి అందజేశారు. వివాహం జరిగిన 15వ రోజు నుంచే మళ్లీ అదనపు కట్నం, లాంఛనాల కోసం మామ చలసాని వెంకటేశ్వరరావుతో పాటు అత్త కృష్ణ పావని, భర్త హర్ష, ఆడపడుచు నర్మద నిత్యం వేధిస్తుండే వారన్నారు. వారు తన తండ్రిని ఫోన్‌లో నిత్యం దూషించడంతో పాటు కొత్త కారును ఇవ్వాలని వేధిస్తున్నారని, ఈ నేపథ్యంలోనే ఇంట్లో ఉన్న తనపై దాడి చేసి, అసభ్యపదజాలంతో దూషించారంటూ బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన ప్రథమ చికిత్స శిక్షణ తరగతులు



సర్టిఫికెట్ అందజేస్తున్న డాక్టర్ విజయ శేఖర్, నాగేశ్వరరావు

భవానీపురం(విజయవాడపశ్చిమ): రోగిని ప్రాణాపాయ పరిస్థితి నుంచి కాపాడేందుకు అవసరమైన ప్రథమ చికిత్సను నేర్చుకోవాలని ఆల్‌మైటీ నర్సింగ్ హోమ్ అధినేత, సెయింట్ జాన్ అంబులెన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ కోలా విజయ శేఖర్ పేర్కొన్నారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో గత రెండున్నర దశాబ్దాలుగా రాష్ట్రవ్యాప్తంగా యువతకు జెమ్స్ అల్లాయిడ్ హెల్త్ ఇనిస్టిట్యూట్, పారా మెడికల్ కోర్సెస్, కేంద్ర ప్రభుత్వ మైన్స్ డిపార్ట్‌మెంట్ (ధన్‌బాద్) సంస్థల ద్వారా ప్రథమ చికిత్స శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. శిక్షణ పొందిన యువతకు భవానీపురం బ్యాంక్ సెంటర్‌లోని ఆల్‌మైటీ నర్సింగ్ హోమ్‌లో ఆదివారం సర్టిఫికెట్లను అందచేశారు. తొలుత శిక్షణ పొందిన వారు సీపీఆర్ విధానాన్ని ఎలా చేస్తున్నారో ఆయన పరిశీలించారు. తమ సంస్థల్లో ఫస్ట్ ఎయిడ్ శిక్షణ పొందినవారు గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలను అందిస్తున్నారని, అలాగే వివిధ సంస్థల్లో ఉద్యోగాలు పొందుతున్నారని చెప్పారు. వైద్య రంగంలో రాష్ట్ర ప్రభుత్వం విప్లవాత్మక సంస్కరణలు తీసుకువచ్చిందన్నారు. వాసవీ ఫార్మా మార్కెట్ కార్యదర్శి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

● ఎంత అందంగా ఉన్నానో..





నున్న సచివాలయం పరిధిలో ఆదివారం ఓ కోతి విన్యాసాలు ఆకట్టుకున్నాయి. సచివాలయానికి ఉన్న కిటికీ అద్దంలో చూసుకుంటూ ఎంత అందంగా ఉన్నానో అంటూ ఫోజులిచ్చింది. ఈ దృశ్యాలను సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ సేవలు నిరుపమానం



వృద్ధులకు సరుకులు పంపిణీ చేస్తున్న ట్రస్ట్ సభ్యులు, దాతలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ సేవలు నిరుపమానమని స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ పి.వెంకటేశ్వర్లు కొనియాడారు. స్థానిక దుర్గాపురం విజయ్ నర్సింగ్ స్కూల్‌లో ఆదివారం ట్రస్ట్ ఆధ్వర్యాన దాత సాయిచరణ్ జ్యూయలర్స్ అధినేత రాజుసింగ్ సహకారంతో వయోవృద్ధులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని వయోవృద్ధులకు నిత్యావసర సరుకులు అందజేశారు. 193 నెలలుగా నిత్యావసర సరుకులు అందజేయటంతో పాటు వారికి ఉచిత వైద్య పరీక్షలు చేసి మందులు అందించటం అభినందనీయమన్నారు. ట్రస్ట్ వైస్ చైర్మన్ తేజ్‌రాజ్ సోలంకీ, ట్రస్టీ, విజయ్ విద్యాసంస్థల అధినేత తట్టి అర్జునరావు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ సేవాగుణం అలవరుచుకోవాలని సూచించారు. వృద్ధులకు ప్రతి ఆదివారం ఆయుర్వేదం, అల్లోపతీ, హోమియో వైద్యనిపుణులచే ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో దాత రాజుసింగ్, ట్రస్టీలు అమరా ఉమామహేశ్వరరావు, ఎస్ఎన్ వరప్రసాద్, కె మధుసూదన రావు, పి.లక్ష్మీనరసింహరావు, ఎస్‌వీయూ సతీష్‌కుమార్, వెంకటేష్ గోదావరి పాల్గొన్నారు.

వైద్య శిబిరంలో 326 మందికి పరీక్షలు



లబ్బీపేట(విజయవాడతూర్పు): న్యూ రాజరాజేశ్వరిపేట వాటర్‌ట్యాంక్ రోడ్డులో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 326 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో సీతారామపురంలోని దీపక్ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రికి చెందిన వైద్యులు బొల్లా హాసిని, వెంకటనారాయణ, ఇతర వైద్య సిబ్బంది పాల్గొని వైద్య పరీక్షలు చేశారు. మధుమేహం, రక్తపోటు, ఈసీజీ వంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించారు. ఆస్పత్రిలో వైద్య సేవలు అవసరమైన వారికి 50 శాతం రాయితీతో చికిత్స అందిస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేటి నుంచి ధ్యాన శిక్షణ తరగతులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): హిమాలయ అమరగురు ఆర్య శ్రీ మహావతార్ బాబాజీ ట్రస్ట్ ఆధ్వర్యాన సోమవారం నుంచి ముత్యాలంపాడులో ఉచిత ధ్యాన శిక్షణా తరగతులు ప్రారంభమవుతాయని కార్పొరేటర్ పెనుమత్స శిరీష ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత ధ్యాన శిక్షణా తరగతులు సోమవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి ముత్యాలంపాడు గంగానమ్మ అమ్మవారి దేవాలయంలో జరుగుతాయన్నారు. వారం రోజుల పాటు నిర్వహించే ఉచిత ధ్యాన శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

ఆర్‌యూబీ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి



మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ ఆర్‌యూబీ పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తిచేయాలని కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతి సూచించారు. స్థానిక మధురానగర్‌లో ఆర్‌యూబీ పనులను ఆదివారం నగరపాలకసంస్థ అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ నిలిచిపోయిన ఆర్‌యూబీ పనులను ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఉన్నతాధికారులు, కాంట్రాక్టర్లతో మాట్లాడి తిరిగి ప్రారంభింప చేశారన్నారు. ఐదు డివిజన్ వాసుల రాకపోకల కోసం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఆర్‌యూబీ వల్ల నగరంలో ట్రాఫిక్ సమస్యలు తగ్గే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సంస్థల్లో రిజర్వేషన్లు అమలు చేయాలి



మాట్లాడుతున్న కార్యవర్గ సభ్యులు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ప్రభుత్వ సంస్థల్లోని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగాల్లో, పదోన్నతుల్లో రిజర్వేషన్లు కచ్చితంగా అమలు చేయాలని అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు కట్టా రమాదేవి కోరారు. రైల్వే ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో రమాదేవి అధ్యక్షతన కార్యవర్గ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చేపట్టాల్సిన కార్యాచరణపై నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ.. సర్వీసు రూల్స్ ప్రకారం ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు దక్కాల్సిన రిజర్వేషన్లు కచ్చితంగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎన్టీఆర్ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల వారీగా విధుల్లో ఎదుర్కొంటున్న సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే సర్వీసు రూల్స్ ప్రకారం ఉద్యోగులకు అందాల్సిన ప్రయోజనాలపై ఆంధ్రప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అండ్ ఆఫీసర్స్ జేఏసీ తరఫున ఆయా శాఖల అధికారులతో మాట్లాడి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి బి.శ్రీనివాస్ నాయక్, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లకు కౌన్సెలింగ్



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఏసీపీ హనుమంతరావు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లకు వెస్ట్ ఏసీపీ హనుమంతరావు ఆదివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. స్టేషన్ ఆవరణలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. కొట్లాటలు, గంజాయి విక్రయాలకు దూరంగా ఉండాలని, ప్రజల ప్రశాంత జీవనానికి ఆటంకం కలిగించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి వారం స్టేషన్‌కు తప్పనిసరిగా వచ్చి అధికారుల ఎదుట హాజరుకావాలని ఆదేశించారు. ఆదివారం ఒక్క రోజే ఎటువంటి నేరాలు, గొడవలు చేయకుండా ఉంటే సరిపోతుందని భావించవద్దని, ప్రతి రోజు నిఘా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐ సుబ్రహ్మణ్యం, ఎస్ఐలు, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

వెలంపల్లిపై తప్పుడు ఆరోపణలు మానుకోవాలి



మాట్లాడుతున్న పాత శివాలయం పాలక మండలి మాజీ సభ్యులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పాత శివాలయంలో అవినీతి జరిగిందని, ఆ పాలక మండలికి, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావుకు సంబంధం ఉందంటూ జనసేన నాయకుడు పోతిన మహేష్ చేసిన ఆరోపణలను భ్రమరాంబ మల్లేశ్వర స్వామి దేవస్థానం(పాత శివాలయం) పూర్వ పాలక మండలి తీవ్రంగా ఖండించింది. వెలంపల్లిపై అవినీతి తప్పుడు ఆరోపణలను మానుకోవాలని హితవు పలికింది. భవానీపురంలోని పాలకమండలి మాజీ చైర్మన్ పదిలం రాజశేఖర్ కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. తమ హయాంలో పాత శివాలయంలో ఎటువంటి అవినీతి జరగలేదన్నారు. పోతిన మహేష్ పూర్తి సమాచారం తెలుసుకొని మాట్లాడాలన్నారు. తమ పదవీ కాలం గతేడాది ఆగస్టుతో ముగిసిందని, తరువాత జరిగిన పరిణామాలకు తమకు ఎటువంటి సంబంధం లేదన్నారు. పాత ఈఓ హేమలతాదేవిపై దేవాదాయ శాఖ ఒక కమిటీని నియమించిందన్నారు. కమిటీ విచారణ చేపట్టిందన్నారు. సమావేశంలో ఆలయ మాజీ ధర్మకర్తలు బండారి వెంకట్, డీవీ రెడ్డి, వడ్లాది అనిత పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధి పనుల పరిశీలన



పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో ఉన్న శ్రీ పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వస్వామివారి దేవస్థానంలో అభివృద్ధి పనులను ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి ఆదివారం పరిశీలించారు. యనమలకుదురు దేవస్థానంలో అనేక అభివృద్ధి పనులు దాత సంగా నరసింహారావు ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. ఆలయం ఘాట్ రోడ్డు విస్తరణ, వాహనాల పార్కింగ్‌కు స్థలం, ప్రాకారం విస్తరణ, కోనేరు నిర్మాణం, ఆలయంలో స్వర్ణ తాపడం ఇతర అభివృద్ధి పనులు అడిగి తెలుసుకున్నారు. ఏపీ ధార్మిక పరిషత్ సభ్యుడు, ఆలయ నిర్మాణ దాత సంగా నరసిహారావు, ఆలయ ఈఓ ఎం.గంగాధరరావు జరుగుతున్న పనుల వివరాలు తెలిపారు. కరకట్ట వద్ద ఉన్న ఆలయ భూమి ఎకరానికి చుట్టూ అధికారులు కంచె నిర్మాణం చేశారని, రాకపోకలకు మార్గం లేదని గ్రామస్తులు ఎమ్మెల్యే పార్థసారథి దృష్టికి తీసుకు వచ్చారు. కార్యక్రమంలో దేవస్థానం సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

గంజాయి కేసులో ఉన్న వారిపై రౌడీషీట్



పెనమలూరు: గంజాయి అక్రమ రవాణా చేసినా, గంజాయి తాగినా రౌడీషీట్లు తెరుస్తామని పెనమలూరు సీఐ ఎం.కిషోర్‌బాబు స్పష్టం చేశారు. పెనమలూరు పోలీస్‌స్టేషన్‌లో ఆయన ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ చేశారు. ఈ సందర్భంగా సీఐ కిషోర్‌బాబు మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్‌లో 47 మందిపై రౌడీషీట్లు ఉన్నాయన్నారు. వారిపై నిరంతరం నిఘా ఉంటుందని తెలిపారు. రౌడీషీటర్లు అసాంఘిక కార్యకలాపాలకు స్వస్తి పలికి ఉద్యోగాలు, వ్యాపారాలు చేసుకుని జీవించాలన్నారు. ప్రవర్తన సక్రమంగా ఉన్న వారిపై రౌడీషీట్లు రద్దు చేస్తామని తెలిపారు. ఇక గంజాయి తాగినా, అక్రమ రవాణా చేసినా వారిపై రౌడీ షీట్లు తెరవడమే కాక కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వారి పై రౌడీషీట్లు తెరుస్తామన్నారు. గంజాయి కేసుల్లో ఉన్న 37 మందిపై కొత్తగా రౌడీషీట్లు తెరుస్తామని తెలిపారు. శాంతభద్రతలకు భంగం కలిగించే ఎవరిని ఉపేక్షించమన్నారు.ఈ కార్యక్రమంలోఎస్ఐలు రాజేష్, ఉషారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
విజయవాడ వెస్ట్ :
90102 10386
Office mail : sakshiads@gmail.com